



# తెలుగోడి కథ

## ఇలపావులూరి మురళీమోహనరావు

"రాయల్ సొసైటీ ఫర్ లిటరేచర్" అనేది బ్రిటన్‌లో ఒక ప్రముఖ సాహిత్య అకాడమీ. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతినొందిన అరవైమంది రచయితలు, కవులు ఈ అకాడమీలో సభ్యులు. ఇండియన్ పార్లమెంట్‌లోనూ, అమెరికా సెనెట్‌లోనూ బ్రిటన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లోనూ సభ్యత్వం సులభంగా దొరుకుతుందేమో కానీ, ఈ అకాడమీలో మెంబర్‌షిప్ దొరకడం బహుదుర్లభం. ఆ అకాడమీలో సభ్యత్వం దొరికిన వ్యక్తికి ఆ దేశాధ్యక్షుడి కంటే అధిక విలువ, గౌరవాలు లభిస్తాయి వారిదేశాలలో.

రా.సొ.లి. నిర్వహించే కార్యక్రమాలలో ఒక ముఖ్యమైన కార్యక్రమం ప్రతి ఏటా ప్రపంచంలోని ఐదుగురు ప్రముఖ కవులను ఎంపిక చేసి వారి చేత లండన్లో నాలుగు రోజులపాటు ప్రసంగాలిప్పించడం. ఈ కార్యక్రమానికి ప్రపంచంలోని నలుమూలలనుండి ప్రముఖ కవులు, రచయితలు, నాటక రచయితలు, కళాకారులు హాజరవుతారు. అంతేకాదు, బ్రిటన్ ప్రధాని, మంత్రివర్గం, పార్లమెంటు సభ్యులు వివిధ దేశాల రాయబారులు, మేధావులు ఈ కార్యక్రమానికి హాజరై ఆయా కవులు, రచయితలు ఇచ్చే ఉపన్యాసాలను శ్రద్ధగా వింటారట.



ఎనభై సంవత్సరాలనుంచి రా.సొ.లి. తన కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నా భారతదేశానికి ఇంతవరకూ వాటిలో పాల్గొనే అవకాశమే రాలేదు. ఫలానా బెంగాలీ కవికి ఈ సంవత్సరం

వస్తుంది. ఫలానా కన్నడ రచయితకు వచ్చే అవకాశం ఉంది అని పత్రికలు పలుమార్లు ఊహాగానాలు చేసినా అవి ఒక్కసారీ నిజం కాలేదు. ఎపుడైనా ఫలానావారికి రావడం ఖాయం అనుకున్నపుడల్లా అతనంటే గిట్టనివారు రాజకీయ పైరవీలు చేసి ఆ అవకాశాన్ని అడ్డుకున్నారనే వార్తలు గుప్పుమనడం పరిపాటైంది. అవకాశం మిస్సవగానే 'మనదేశంలో వందల పుస్తకాలు రాసి పద్మశ్రీ అవార్డులు అందుకున్నవారు కూడా ఉన్నారు. వీరెవరూ రా.సా.లి. దృష్టికి రాలేదా?' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు పత్రికలలో రాసేవారు కొందరు. 'భారతదేశం బ్రిటీష్ వారి కాలంలో బానిసత్వం అనుభవించింది. అందుకే భారత్ అంటే వారికి చిన్న చూపు' అని ఈసడించేవారు మరికొందరు.

'ఈసారి తప్పకుండా ఆ అవకాశం మనకే వస్తుంది' అని చకోర పక్షుల్లా ఎదురుచూసేవారు కొందరు కవులు. తీరా రాలేదని తెలియగానే నిట్టూర్చేవారు.

అలాంటిది ఈ సారి ఏమైందో ఏమో– ప్రముఖ తెలుగు కవి గోపాలరత్నం గారిని ఉపన్యాసానికి ఎంపిక చేసినట్లు రా.సా.లి ప్రకటించింది. ఈ వార్త టెలిగ్రామ్ ద్వారా చేరగానే ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు గోపాలరత్నం.

గోపాలరత్నానికి అరవై సంవత్సరాలుంటాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశాడు. సరస్వతీ పుత్రుడని ఆయనకు పేరుంది. పది సంవత్సరాల వయసులో అష్టావధానం చేసి బాలమేధావిగా గుర్తింపుపొందాడు. పదిహేను సంవత్సరాల వయసులో ఆయన రాసిన పద్యకావ్యం 'మందార గంధం' నాడు ఎమ్మేలో తెలుగు ఉపవాచకంగా నాలుగు యూనివర్శిటీలు ఎంపిక చేశాయి. ఆ గ్రంథంలోని భాషా సౌందర్యానికి తలలుపండిన కవులంతా విస్తుపోయారట.

గోపాలరత్నం ఎమ్మేలో చేరినపుడు ఆయన కూడా తాను రాసిన గ్రంథమే చదవాల్సి వచ్చినపుడు వింత అనుభూతికి లోనయ్యాడు. పాఠం చెబుతున్న ప్రొఫెసర్ ఒక పద్యాన్ని చదివి 'కవి అంతరార్థం ఇదీ' అని బోధిస్తుంటే గోపాలరత్నం లేచి దానిని ఖండించి 'కవి ఉద్దేశ్యం ఇదీ' అని చెప్పగానే ప్రొఫెసర్‌గారు ఆగ్రహోదగ్రులై ''పెద్దమగాడిలా అదేదో నువ్వే రాసినట్లు చెబుతున్నావే'' అని చిందులేస్తే ''అవును నేనే రాశాను'' అని తరువాతి పద్యాలను కూడా కర్ణపేయంగా ఆలపించాడు. ప్రొఫెసర్లంతా అవాక్కై కలసికట్టుగా గోపాలరత్నానికి పాదాభివందనాలు చేశారు.

ఆ తరవాత ఉద్యోగపర్వంలో చేరిన గోపాలరత్నం గత నలభై సంవత్సరాలలో దాదాపు ఎనభై గ్రంథాలు రాశాడు. ఆయన కావ్యాలు దేశ వ్యాప్తంగా ప్రచారమయ్యాయి. భారత దేశంలోని అత్యుత్తమ సాహిత్య పురస్కారాలన్నీ లభించాయి. వేలాదిమంది అభిమానులు చేరారు. పార్టీలకతీతంగా అన్నిరకాల రాజకీయనాయకులతో ప్రభుత్వాధినేతలతో సత్సంబంధాలున్నాయి. అన్ని రాష్ట్రాలలో, ఐదారు విదేశాలలో పర్యటించాడు. తెలుగు సాహిత్య చరిత్ర ఎవరైనా గ్రంథస్తం చేస్తే గోపాలరత్నంకు తప్పనిసరిగా పదిపేజీలు కేటాయించాల్సిందే అన్నంతపేరు సంపాదించాడు. నగరంలో ఏ సాహిత్య సభజరిగినా అందులో ప్రధానవక్త గోపాలరత్నమే.

గోపాలరత్నం రచనలు కొన్ని ఆంగ్లంలోకి కూడా అనువదించబడ్డాయి. ఆ రకంగా అంతర్జాతీయ గుర్తింపును కూడా సాధించాడు. దాని ఫలితమే కావచ్చు నేడీ ఆహ్వానం.

టెలిగ్రామ్‌ని వందసార్లు చదివి పులకించిపోయాడు గోపాలరత్నం. సన్నిహితులకు ఫోన్ చేసి చెప్పాడు. ఆ అవార్డు విలువ తెలిసిన వారు గోపాలరత్నాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు.

గోపాలరత్నానికి దక్కిన ఈ పురస్కారం గురించి తెలిసిన పత్రికల వారు, టీవీల వారు గోపాలరత్నానికి ఫోన్లు చేసి బయోడేటాలడిగారు. తన వివరాలన్నీ చెప్పాడు గోపాలరత్నం మన దేశ దౌర్భాగ్యాన్ని తిట్టుకుంటూ. తను ఏభై సంవత్సరాలనుంచీ సాహిత్య సేవలో ఉన్నా తన గురించి ఎవరికీ సమగ్రంగా తెలియకపోవడం ఏ కవికైనా చింతకలిగిస్తుంది మరి!

దాదాపు నోబెల్ పురస్కారానికున్నంత విలువ కలిగిన ఈ అవకాశం దేశంలో మొట్టమొదటి సారిగా తనకు లభిస్తే టీవీల వాళ్ళు, పత్రికలవారు తనను చుట్టుముట్టి ఇంటర్వ్యూలు తీసుకుని ఆకాశానికెత్తుతారని ఆశించాడు గోపారత్నం. కానీ అదేమీ జరగలేదు.

వార్తలు మొదలుబెడుతూనే 'నిజమాబాద్‌లో రెండు బస్సులు ఢీ.... నలభై మంది దుర్మరణం' అని కాళ్ళు చేతులు విరిగిపోయిన, ఈగలు ముసురుతున్న కళేబరాలను క్లోజప్‌లో ఒకటికి పదిసార్లు చూపించే టీవీ వాళ్లు – ఒక్క పరుగుకే అవుటైపోయి బ్యాట్‌ను ఊపుకుంటూ పెవిలియన్ దారిపడుతున్న క్రికెటర్‌ను క్లోజప్‌లో చూపించే టీవీల వాళ్ళు –

చదరంగం టేబుల్‌ముందు కూర్చుని పావులు అటు ఇటు తిప్పుతూ గెలిచో, ఓడిపోయే పది సంవత్సరాల కుర్రకుంకల్ని కుటుంబసభ్యులతో సహా చూపించే టీవీల వాళ్లు–

పదేళ్ళ సాధన చేసి ఏదో క్రీడా పోటీలో వందకేజీల బరువును ఒక్కసెకను పాటు ఎత్తి కిందపడేసే వాళ్ల ముఖాలను తెరనిండా చూపించి ఇదేదో ఘనకార్యాలన్నట్లుగా ప్రచారాలు చేసే టీవీల వాళ్లు–

అఖండమైన మేధస్సు, జీవితకాలపు పరిశ్రమతో మాత్రమే సాధించగల ఇలాంటి అరుదైన అవకాశం ఒక తెలుగు వాడికి వస్తే చిన్న స్క్రోల్ వార్తగా నాలుగైదు సార్లు చూపించి కెమెరాలు మూసేశారు.

కాశ్మీర్లో తీవ్రవాదుల దారుణం– ఏభైమంది ఊచకోత, ఎన్‌కౌంటర్లో నలుగురు నక్సల్స్ కాల్చివేత లాంటి దడుపు జ్వరం తెప్పించే హెడ్‌లైన్స్‌తో తరించిపోయే పత్రికల వారు గోపాలరత్నంగారికి వచ్చిన అరుదైన ఆహ్వానాన్ని ఎక్కడో సిటీ ఎడిషన్లలో పాతిక ప్రకటనల మధ్య ఒక చిన్న వార్తగా ప్రచురించి చేతులు దులుపుకున్నారు.

మీడియా ప్రతిస్పందన చూసి చాలా నిరాశ చెందాడు గోపాలరత్నం. ప్రపంచం గుర్తించినా చుట్టుపక్కలవారు గుర్తించరు' అనుకున్నాడు.

ఇంట్లో కూర్చుని ఇతర ఛానెల్స్ ఎలా స్పందిస్తున్నాయో స్కాన్ చేసి చూస్తున్నాడు. బి.బి.సి.లో వార్తలు వస్తున్నాయి. గోపాలరత్నం ఆశ్చర్యానికి అంతేలేదు. ఇలాంటి అవకాశం సాధించిన అమెరికా నవలా రచయిత వాట్సన్ విశాలమైన భవనం ముందు వేలాదిమంది జనం! అందరి చేతుల్లో పూలగుత్తులు! అమెరికా అధ్యక్షుడు స్వయంగా వాట్సన్ ఇంటికి వచ్చి కౌగిలించుకుని అభినందిస్తున్నాడు! వాట్సన్ జీవితాన్ని గురించి క్లిప్పింగ్స్ చూపిస్తున్నారు.

తరువాత ఫ్రాన్స్ దేశపు మహాకవి షెర్వాన్ గురించి ఐదునిమిషాలు డాక్యుమెంటరీ చూపించారు. కెనడా దేశపు రచయిత రోనాల్డ్స్ ఇంటర్వ్యూ, ఆయన జీవిత విశేషాలు చూపించారు. కెనడా దేశాధ్యక్షుడు రోనాల్డ్స్ గౌరవార్థం ఆ రాత్రి విందు ఏర్పాటు చేశాడట!

## టాకింగ్ డాగ్



**ఒ**క కాక్‌టెయిల్ పార్టీలోకి ఒకాయన కుక్కతో సహా వచ్చాడు.

''ఇది మాట్లాడేకుక్క, అనుమానముంటే వెయ్యిరూపాయలిచ్చి టెస్ట్ చేసుకోవచ్చు'' అన్నాడు.

ఒకాయన ఉత్సాహపడి వెయ్యి ఇచ్చి ''ఇది నిజంగా మాట్లాడుతుందా?'' అని అడిగాడు.

''మాట్లాడుతున్నా కదా!'' అంది కుక్క.

ఆయనకు తలతిరిగిపోయింది. మరో వెయ్యి ఇచ్చి '' ఇది నిజమా'' అన్నాడు.

''నిజంగా నిజం'' అంది కుక్క.

ఆ ఆసామికి నమ్మకం కుదరక '' ఇందులో ఏదో మోసముంది'' అని అరిచాడు.

కుక్కకి చిర్రెత్తుకొచ్చి ''వీడి సంగతి చూడమంటావా బాస్'' అని మొరిగింది.



## మోసం

సినిమాల్లో కనిపించకపోయినా, డయానా హైడెన్ ఎప్పుడూ పత్రికల్లో నానుతూనే వుంటోంది. 'హన్స్' సినిమాలో హాట్ సీన్స్‌లో నటించి సెన్సేషన్ సృష్టించింది. కొంతకాలం గుల్షన్ గ్రోవర్‌తో ప్రేమ గొడవ. ఇప్పుడేమో 'భారతీయ మగాళ్లలో ప్రతి రెండవవాడు ఒక మోసగాడు' అని స్టేట్‌మెంట్ ఇచ్చిపడేసింది. పాపం అందరూ మోసగాళ్లే తగిలినట్టున్నారు!

ఆస్ట్రేలియా కవి పిటర్ స్వీనీ పత్రిక ఇంటర్వ్యూ ప్రసారం చేశారు. అయిన పిదప భారత్ పోయెట్ గోపాల్‌రతనామ్ గురించిన వివరాలు తెలియాల్సి ఉందని, భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖకు ఈ-మెయిల్ పంపి నాలుగు రోజులైనా ఇంత వరకూ వారినుంచి వివరాలు రాలేదని, రాగానే ప్రసారం చేస్తామని చెప్పి వార్తలు ముగించారు.

ఆయా దేశాలలో సాహిత్య వేత్తలకు లభిస్తున్న గౌరవాదరాలు చూసి పొంగిపోయిన గోపాలరత్నం మన దేశంలో సాహిత్యవేత్తలకు ఎదురవుతున్న నిరాదరణను చూసి కుంగిపోయాడు. ఎక్కడలేని నిస్సత్తువ ఆవరించింది.

గోపాలరత్నం భార్య సీత కాఫీ తెచ్చింది.

''ఏం చేద్దామనుకుంటున్నారు?'' అన్నది.

''రాను పోను విమానం టిక్కెట్లు, హోటల్ వసతి, వాహన సౌకర్యం వాళ్లే చూసుకుంటారు. కానీ ఎంతలేదన్నా పైన కనీసం ఏభైవేల రూపాయలైనా ఉండాలి'' అన్నాడు గోపాల రత్నం.

''అంతడబ్బు మనం ఎలా తేగలం?'' వణుకుతున్న స్వరంతో అన్నది సీత.

''అదే అర్థం కాకుండా వుంది. జన్మలో ఒకే ఒక్కసారి లభించే అరుదైన అవకాశం ఇది. ప్రపంచనాయకులు చాలామంది ఈ సెమినార్‌కు ఆహ్వానితులు. ఇంతమంది ముందు ఉపన్యసించే అవకాశం రావడం ఓ మధుర స్వప్నంలాంటిది కదూ?''

''నిజమే....! మనం జీవితపు చరమాంకంలో ఉన్నాం. ఆర్థిక పరిస్థితి బలహీనం. పైగా మందులతో బ్రతుకుతున్నాం. ఇంత ఖర్చు ఎలా తట్టుకోవాలి?''

''పిల్లలేమైనా సరుద్దబాటు చేస్తారం టావా?''

''సర్దుబాటు అనకండి. సాయం అనాలి. మనం మళ్లీ తిరిగి ఇవ్వగలిగితే సర్దుబాటు. మళ్లీ ఇవ్వలేం కదా!''

''అదీ నిజమే.... పోనీ... సాయం చేస్తారం టావా?''

''అడిగి చూడండి''

''అవును. ముందు వాళ్ళకీ శుభ వార్త చెప్పాలి'' అని వైజాగ్‌లో ఉంటున్న పెద్దకొడుక్కు ఫోన్ చేశాడు.

''ఏం సొసైటీ అది?'' అడిగాడు పెద్దకొడుకు.

వార్త చెప్పగానే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బై కంగ్రాచ్యులేషన్స్ అంటాడేమో అని ఆశించిన గోపాలరత్నం, కొడుకు వేసిన ప్రశ్నకు ఖంగు తిన్నాడు.

రా.సా.లి. గురించి వివరంగా చెప్పాడు గోపాలరత్నం.

''ఇంతకు ముందు నాలుగైదుసార్లు విదేశాల కెళ్లొచ్చావుగా. ఈ వయసులో అంతదూరమేం వెళ్తావు? పైగా మాక్కూడా డబ్బుకు చాలా ఇబ్బందిగా ఉంది'' అన్నాడు పెద్ద కొడుకు.

తనకు లభించిన గౌరవం పట్ల అతనికి ఏమాత్రం అవగాహన లేదనుకున్న గోపాలరత్నం ఫోన్‌పెట్టేసి కాకినాడలో ఉంటున్న రెండో కొడుక్కు ఫోన్ చేశాడు.

''వాళ్లొక లెక్చర్ ఇప్పించినంత మాత్రానా నీకూ నాకూ ఒరిగేదేముంది? ఈ కవిత్వాలతో కడుపు నిండదని నీకు ఇన్నేళ్ల తరువాత కూడా అర్థం కాలేదా నాన్నా? ఇలాంటి వృథా వ్యయాన్ని భరించే తాహతు నాకులేదు'' అన్నాడు రెండో కొడుకు.

హతాశుడయ్యాడు గోపాలరత్నం.

''వాళ్లు చెప్పిందీ నిజమే. ఈ కవిత్వం పిచ్చి వాళ్లకు లేదు. అందువల్ల వారినుకుని ప్రయోజనం లేదు. ఎంతోమంది మంత్రులు, కలెక్టర్లు మీకు స్నేహితులైనా, కొడుకులకు మంచి ఉద్యోగాలిప్పించకలేకపోయారు. అరకొర సంపాదనలతో నెట్టుకొస్తున్న వాళ్లను సహాయం చెయ్యమనడం అత్యాశకదా'' అన్నది సీత.

ఆమె చివరిమాటలెలా ఉన్నా తన కవిత్వాన్ని 'పిచ్చి' అన్నందుకు బాధపడ్డాడు గోపాలరత్నం. లోకమంతా గౌరవించే వ్యక్తికి ఇంట్లో గుర్తింపే ఉండదు.

టీవీ వార్తల్లో విద్యాశాఖామాత్యుడు ఏదో సభలో ప్రసంగిస్తున్నాడు. 'సాహిత్యాభివృద్ధికి, విద్యారంగానికి రాబోయే సంవత్సరంలో ఐదు వందల కోట్ల రూపాయలు ఖర్చుపెడతామని, అన్ని మండలాలలో ఆడిటోరియంలు నిర్మిస్తామని, నిధుల సమస్యేలేద'ని ఆవేశంగా ఉపన్యసిస్తున్నాడు.

అది చూడగానే ''విద్యాశాఖమంత్రి మీకు చాలా ఆప్తమిత్రుడు కదా! ప్రభుత్వం నుంచేమైనా సాయం చేయగలడేమో అడగండి'' అన్నది సీత.

''అవును. సమయానికి చక్కని సలహా ఇచ్చావు. నా కవిత్వమంటే ఆ మంత్రికి ప్రాణం. అనేక మీటింగులలో బహిరంగంగా చెప్పాడు'' అని మంత్రికి ఫోన్ చేశాడు గోపాలరత్నం.

''అవునవును. టీవీలో చూశాను. అభినందనలు. ఎప్పుడు ప్రయాణం?'' అన్నాడు మంత్రి.

''ఆర్థిక పరిస్థితి బాగాలేదు. ప్రభుత్వం నుంచేమైనా కొంత... ఓ యాభైవేలు సాయం ఇప్పించగలరా?'' అన్నాడు గోపాలరత్నం.

''అబ్బో... గవర్నమెంటునుంచా? ఖజానా అంతా ఖాళీ. రూపాయి కావాలన్నా వరల్డ్‌బ్యాంక్ ముందు చెయ్యి జాపాల్సివస్తున్నది. నిధులులేవు'' అన్నాడు మంత్రి.

ఆశ్చర్యపోయాడు గోపాలరత్నం. ''అదేంటి? సాహిత్యాభివృద్ధి కోసం ఎంతైనా ఖర్చు పెడతామని, నిధుల సమస్యేలేదని మీరన్నట్లు ఇప్పుడే వార్తల్లో చూశాను'' అన్నాడు.

ఐదు నిమిషాలపాటు ఆగకుండా నవ్వాడు మంత్రి. ''మీరు మహాకవి. మీటింగుల్లో చెప్పే మాటలు నమ్ముతారా? నిధుల సమస్యలేదంటే అసలు నిధులే లేనపుడు సమస్య ఏముంటుందని అర్థం'' అన్నాడు.

చిరాగ్గా ఫోన్ పెట్టేశాడు. భర్త ముఖ కవళికలను బట్టి విషయం గ్రహించింది సీత. అటకలవైపు, అలమరలవైపు చూశాడు గోపాలరత్నం. పాతిక సంవత్సరాల నుంచీ గోపాలరత్నం ప్రచురించిన గ్రంథాలు కట్టలు కట్టలుగా ఉన్నాయి. 'నిన్ను

వదిలి నేను పోలేనులే, అది నిజములే' అన్నట్లు చూస్తున్నాయి. వాటిని ఎవ్వడూ కొనడు. ఉచితంగా ఇచ్చినా తీసుకోడు. చిత్తు కాగితాల వాడికి అమ్మాలంటే ప్రాణమొప్పదు.

మెడలోని చంద్రహారం, చేతులకున్న ఆరు గాజులు భర్తముందుంచింది సీత. తడిబారి నయనాలతో వాటివంక చూశాడు గోపాలరత్నం.

* * *

లండన్ విమానాశ్రయంలో దిగిన గోపాల రత్నాన్ని రా.సో.లి.వారు సాదరంగా స్వాగతించారు.

''మీలాంటి మహాకవి... మా ఆహ్వానాన్ని మన్నించడం మా అదృష్టం. మీకు ఫైవ్‌స్టార్ హోటల్లో వసతి ఏర్పాటు చేశాం. మా ప్రతినిధి కారుతో సాహా ఇరవైనాలుగు గంటలూ మీ వెంట ఉంటాడు. తెలుగు భాషా సౌందర్యం మీద మీ ఉపన్యాసం ఉంటుంది. ముందు విశ్రాంతి తీసుకోండి'' వినయంగా చెప్పి ఫ్లవర్ బొకె, ప్రోగ్రాం వివరాలతో కూడిన బ్రోచర్ అందించాడు రా.సా.లి. ప్రతినిధి. గోపాలరత్నం గురించి తెలిసిన రెండు మూడు తెలుగు కుటుంబాల వారు కూడా స్వాగతం పలికారు గోపాలరత్నంకు.

అదే సమయంలో దిగిన ఫ్రాన్స్, కెనడా విమానాల్లో వచ్చిన ఆ దేశ కవులకు లండన్లో వుంటున్న ఆయా దేశవాసులు వందలాది మంది వచ్చి ఆ కవులను భుజాల మీద మోసుకుని ఉత్సాహంతో జయజయధ్వానాలు చేస్తూ విమానాశ్రయం నుంచి తీసుకువెళ్తున్న దృశ్యం చూసి ఈర్ష్యపడ్డాడు గోపాలరత్నం.

* * *

సెమినార్ బ్రహ్మాండంగా జరిగింది. బ్రిటీస్ రాణి, ప్రధాని, మంత్రులు, రాయబారులు హాజరయ్యారు. గోపాలరత్నం తన మధురగాత్రంతో తెలుగు పద్యాలు ఆలపించి ఆహూతులను సమ్మోహితులను గావించాడు. భాష అర్థంకాకపోయినా, ఆయన వాగ్ధాటికి ఆడిటోరియం అంతా చప్పట్లతో మార్మోగింది. ఆయన శబ్దచాతుర్యానికి పరవశించిపోయారంతా. ఇలాంటి కవికి ఇంత వరకూ అవకాశం దొరకనందుకు తమ ఉపన్యాసాలలో బాధను వెలిబుచ్చారు వక్తలు. బ్రిటన్‌రాణి గోపాలరత్నంకు ఘనాతి ఘనంగా సన్మానం చేసింది. ఈ సంఘటనను ఇతర కవుల దేశాలు ప్రత్యక్ష ప్రసారం చెయ్యగా భారతదేశంలో - తెలుగు రాష్ట్రంలో ఒక స్టిల్ చూపించి రెండు వాక్యాల వార్త ప్రసారం చేశారు.

* * *

తమ తమ భావాలు పంచుకోవడానికి వీలుగా చివరి రోజు ఐదుగురి సాహిత్య వేత్తలతో ఒక గెట్‌టుగెదర్ ఏర్పాటు చేసింది రా.సా.లి.

మిగిలిన నలుగురు సాహిత్యవేత్తల గురించి గోపాలరత్నంకు కొంచెం తెలుసు. మరింత వివరంగా తెలుసుకునే అవకాశం రావడంతో ముందుగా ''మీరెన్ని నవలలు రాశారు?'' అని వాట్సన్‌ను అడిగాడు.

వాట్సన్ నవ్వి ''నేను నా ఏభై సంవత్సరాల జీవితంలో రాసింది ఒకే ఒక్క నవల. పాతికేళ్ల క్రితం రాశాను. రాయడానికి ఐదు సంవత్సరాలు పట్టింది. అది ఇప్పటికి ఎనభైసార్లు పునర్ముద్రణకు నోచుకుంది. రాయల్టీగా నాకు సంవత్సరానికి ఇరవై లక్షలు డాలర్లు లభిస్తాయి. గత పన్నెండు సంవత్సరాలుగా శ్రమించి మరో నవల రాశాను. దాన్ని ప్రచురిస్తామని ఎనిమిది సంస్థలు ఎనిమిది నుంచి పదహారు లక్షల డాలర్లు అడ్వాన్సిచ్చాయి. ఎవరికి దక్కుతుందో చూడాలి'' అన్నాడు.

గోపాలరత్నం తల తిరిగిపోయింది. ఫ్రాన్స్ కవి షెర్వాన్‌ను ప్రశ్నించాడు.

''నేను రెండు పుస్తకాలు పబ్లిష్ చేశాను. వాటిని ప్రపంచంలో ఎనభై ఆరుభాషలలో అనువాదం చేశారు. ఒక్కొక్కటి నలభై సార్లు రీ ప్రింట్ అయ్యాయి. సంవత్సరానికి ఇరవై లక్షల డాలర్ల రాయల్టీ వస్తుంది. నేను మరో పుస్తకం రాయాలని దాదాపు ఆరులక్షల మంది పాఠకులు తలా వందడాలర్లు అడ్వాన్స్ పంపించారు. మరో నాలుగు లక్షల మంది అడగ్గానే ప్రచురిస్తాను'' చెప్పాడు.

గొంతువణికింది గోపాలరత్నానికి. గుండె ఆగిపోగూడదని భగవంతున్ని ప్రార్థిస్తూ కెనడా రచయిత రోనాల్డ్‌ను అడిగాడు. ''నేను మురికివాడలో పుట్టి బాల్యమంతా దుర్భరమైన పేదరికంలో గడిపాను. నేను పుట్టిన పరిసరాలను, అప్పటి జీవనస్థితిగతులను నాటకంగా మలిచి ఇరవై సంవత్సరాల క్రితం ప్రచురించాను. అది అత్యంత ప్రజాదరణ పొందింది. దాంతో నాటక రచనను వృత్తిగా స్వీకరించాను. మరో రెండు నాటకాలు రాశాను. మొదట రాసిన నాటకాన్ని లండన్లో గత ఇరవై సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రదర్శిస్తున్నారు. రెండు నెలల ముందుగా టిక్కెట్లు తీసుకోవాల్సిందే. ఆ నాటకం మీద వచ్చిన ఆదాయంతో కెనడాలో ఒక ద్వీపాన్ని, సొంత విమానాన్ని కొనుక్కున్నాను'' చెప్పాడు.

ఆస్ట్రేలియా కవి పీటర్ స్వీనీ ''మీరెన్ని పుస్తకాలు రాశారు?'' ఆసక్తిగా అడిగాడు గోపాలరత్నాన్ని.

''వందపుస్తకాలు, నాలుగువేల వ్యాసాలు'' చెప్పాడు గోపాలరత్నం.

నలుగురూ ఆశ్చర్యపోయారు. ''మైగాడ్... వంద పుస్తకాలే! వెయ్యి సంవత్సరాలు జీవించినా మాదేశాల్లో అన్ని పుస్తకాలు ఏ కవీ రాయలేడు. అయితే మీరు ఇండియాలో సగభాగం కొని ఉంటారు'' అన్నాడు వాట్సన్ ఆసక్తిగా.

విషాదంగా నవ్వాడు గోపాలరత్నం. ''మా నాన్న నాకు వంద ఎకరాల భూమి, రెండు ఇళ్లు ఆస్తిగా ఇచ్చిపోయాడు. ఒక్కొక్క ఎకరం అమ్మి ఒక్కో పుస్తకం ప్రచురించాను. నా యావత్సంపాదన, ఆస్తి పుస్తకాలతో హరించుకుపోయింది. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాము. మా దేశంలో ఎంత లావు మహాకవైనా తన పుస్తకాలు తానే అచ్చువేసుకోవాలి. బతిమాలి బతిమాలి తానే అమ్ముకోవాలి. ఆఖరుకు పుస్తకావిష్కరణ ఖర్చు కూడా మేమే భరించుకోవాలి. మాదేశంలో ఎవరూ పుస్తకాలు కొనరు. పక్కవాడు కొంటే దానిని తొంగిచూస్తాడు. మాదేశంలో అత్యంత వృథాగా భావించే ఖర్చు పుస్తకం, పేపర్ కొనడమే. ఏభై రూపాయలు పెట్టి రెండు గంటల సినిమా చూసేవాడు రెండు రూపాయలు పెట్టి దినపత్రిక కొనడు. మా దేశంలో అవార్డు అంటే ఒక చెక్కబొమ్మ. సన్మానం అంటే ఏభై రూపాయల శాలువా. మాదేశంలో ఏ కవీ గ్రంథరచన చేసి సంపాదించలేడు. ఇల్లు గడవడానికి ఉద్యోగం చెయ్యక తప్పదు. మరో విశేషం తెలుసా? ఫలానా మహాకవి మన బజార్లోనే ఉంటున్నాడని ఇరుగుపొరుగులకే తెలియదు. నేనుకవిని అని అరిచి చెప్పుకోవాల్సిందే. అంతెందుకు? ఇక్కడకు రావడానికి నా భార్య తన బంగారం అమ్మి పై ఖర్చులు సమకూర్చింది'' అశ్రునయనాలతో చెప్పాడు గోపాలరత్నం.

★

